సాక్షి ఆదిలాబాద్

బుధవారం, 3, సెప్టెంబర్, 2025



వాగు.. అవస్థలు 8లో▸

భారీ వర్షాలకు వాగులో నీటి ప్రవాహం పెరిగింది. ఇంద్రవెల్లి మండలంలోని మామిడిగూడ(జీ), మామిడిగూడ (బీ) గ్రామాలవాసులు ఇబ్బందిపడ్డారు.



రోడ్డు కష్టాలు ఇంకెన్నాళ్లు..

తలమడుగు మండల కేంద్రానికి సమీపం లోని నాలుగు గ్రామాల రైతులకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు. ఏటా శ్రమదానంతో బాగు చేసుకుంటున్న దుస్థితి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'పోక్సో'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: పోక్సో చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టంతో పాటు బాలల హక్కులపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు మంగళవారం ఓరియంటేషన్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2012లో పోక్సో చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. నేర నిరూపణ అయితే నిందితుడికి మూడేళ్ల జైలుతో పాటు ఉరి శిక్ష సైతం విధించే అవకాశం ఉంటుందన్నారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ పిల్లలకు విద్యా సంస్థల్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, యూనిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్, కామారెడ్డి డీసీపీవో స్రవంతి, డీఐఈవో గణేశ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి తిరుపతి, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: పేదల పెన్నిధి, సంక్షేమ పథకాల ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహానేత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. పేదల కోసం ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునిల్ జాదవ్, మాజీ సర్పంచ్ ప్రతిభ, విశాల్, గోవింద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

8న వైద్యపోస్టులకు ఇంటర్వ్యూ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులకు ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, సీఎంవో, ఆర్ఎంవో పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ rimsadilabad. org, adilabad. telangana. gov. in లలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు నిజ ధ్రువ పత్రాలతో రిమ్స్ మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.

6న ఉద్యోగులకు క్రీడా పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 6న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అథ్లెటిక్స్,బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నీస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నీస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఖోఖో, రెజ్లింగ్, యోగా, బెస్ట్ ఫిజిక్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి గల ఉద్యోగులు ఈనెల 4న సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440765485, 9494956454 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం షాపులు బంద్

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నిమజ్జనం పురస్కరించుకొని ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపులను బుధవారం సాయంత్రం 6 నుంచి ఈనెల 5వ తేది ఉదయం 10 గంటల వరకు మూసివేయాలని ఎక్సైజ్ సీఐ విజేందర్ ప్రకటనలో తెలిపారు. తాంసి, భీంపూర్, జైనథ్, మావల, ఆదిలాబాద్ పట్టణంలోని వైన్స్‌లు, బార్లు, తెల్లకల్లు దుకాణాలను మూసి ఉంచాలని పేర్కొన్నారు. అలాగే ఈనెల 5న సాయంత్రం 6 నుంచి 7వ తేది ఉదయం 10 గంటల వరకు బేల,తలమడుగు, జైనథ్, మావల, ఆదిలాబాద్ పట్టణంలోని వైన్స్‌లు, బార్లు, కల్లు దుకాణాలు మూసి ఉంచాలని పేర్కొన్నారు. విషయాన్ని మద్యం షాపుల నిర్వాహకులు గమనించాలని సూచించారు.

దంచికొట్టిన వానలు

- నిండిన ప్రాజెక్టులు, చెరువులు
- ఆగస్టులో అధిక వర్షపాతం
- ఏకంగా 56 శాతం అధికం

జిల్లాలో వర్షపాతం వివరాలు (జూన్ 1 నుంచి సెప్టెంబర్ 2 వరకు)

సాధారణం : 847.5 మి.మీ.లు	
కురిసింది : 1,043.6 మి.మీ.లు	
వ్యత్యాసం : 23 శాతం అధికం	
స్థితి : అధికం	



అలుగు పారుతున్న కరత్వాడ చెరువు

నెలల వారీగా (మి.మీ.లలో)

నెల	సాధారణం	కురిసింది	వ్యత్యాసం	స్థితి
జూన్	209.4	215	3 శాతం అధికం	సాధారణం
జూలై	323.3	274.5	-15 శాతం తక్కువ	సాధారణం
ఆగస్టు	295.3	462	56 శాతం అధికం	అధికం
సెప్టెంబర్	167.8	--	--	--

మండలాల వారీగా.. (జూన్ 1 నుంచి సెప్టెంబర్ 2వరకు)

మండలం	సాధారణం (మి.మీ.లలో)	కురిసింది (మి.మీ.లలో)	స్థితి
భీంపూర్	732.1	871.4	సాధారణం
జైనథ్	869.6	1251.3	అధికం
బేల	840.7	1063.8	అధికం
గాదిగూడ	829.0	790.5	సాధారణం
నార్నూర్	852.4	964.3	సాధారణం
ఇంద్రవెల్లి	977.5	1157.7	సాధారణం
గుడిహత్నూర్	832.1	1299.0	అధికం
ఆదిలాబాద్‌రూరల్	865.6	1072.3	అధికం
ఆదిలాబాద్‌అర్బన్	849.6	1116.3	అధికం
మావల	823.9	1079.5	అధికం
తాంసి	786.3	983.4	అధికం
తలమడుగు	789.3	974.1	అధికం
బజార్‌హత్నూర్	864.9	1120.2	అధికం
బోథ్	815.7	837.8	సాధారణం
నేరడిగొండ	817.0	837.8	సాధారణం
ఇచ్చోడ	874.5	1369.7	అధికం
సిరికొండ	909.4	1164.5	అధికం
ఉట్నూర్	925.4	1038.5	సాధారణం
సొనాల	815.7	767.8	సాధారణం
సాత్నాల	858.2	1139.4	అధికం
భోరజ్	868.0	1001.4	సాధారణం

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో గడిచిన నెలలో వర్షాలు దంచి కొట్టాయి. ఆగస్టులో ఏకంగా 56 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూన్, జూలై వరకు సాధారణానికే పరిమితమైన విషయం విదితమే. గడిచిన నెలలో కురిసిన వర్షాలతో ప్రస్తుతం జిల్లా వర్షపాతం ఏకంగా అధిక స్థితికి చేరువైంది. జిల్లా వార్షిక వర్షపాతం 1154.9 మి.మీ.లు. వానాకాలం వరకు 995.8 మి.మీ.లు సాధారణ వర్షపాతం. అయితే ఇప్పటివరకు 23 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం రుతుపవనాలు చురుకుగా కదులుతుండడంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సెప్టెంబర్‌లోనూ ఇదే కొనసాగితే వర్షపాతం అత్యధికంగా నమోదయ్యే అవకాశాలు లేకపోలేదు.

12 మండలాల్లో అధికం..

ఆగస్టులో కురిసిన వర్షాలతో జిల్లాలో వర్షపాతం గణనీయంగా పెరిగింది. 12 మండలాల్లో అధికంగా, తొమ్మిది మండలాల్లో సాధారణ స్థితి నమోదైంది. ఇదిలా ఉంటే ఆగస్టు మూడో వారం నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరుణుడు ఇక శాంతించాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రాజెక్టులు, చెరువులకు జల కళ

జూలై చివరి వరకు సాధారణ వర్షపాతం ఉండడంతో జలాశయాలు పూర్తిస్థాయిలో నిండలేదు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని రెండు ప్రాజెక్టులు సాత్నాల, మత్తడి వాగు నిండు కుండలా తయారయ్యాయి. ఆయా ప్రాజెక్టుల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇక జిల్లాలోని సుమారు 300 చెరువులు పూర్తిగా నిండాయి. పలుచోట్ల అలుగు పారాయి. భూగర్భ జలాలు సైతం గణనీయంగా పెరిగాయి.

వేటు..సరైనదే

- ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై పార్టీ ముఖ్యనేతల అభిప్రాయం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన నేపథ్యంలో అధిష్టాన నిర్ణయం సరైనదే అని ముఖ్యనేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం పార్టీకి లాభమే తప్ప ఎలాంటి నష్టం చేకూర్చదంటున్నారు. – సాక్షి,ఆదిలాబాద్

పార్టీకి నష్టం లేదు



గతంలోనూ పార్టీ సిద్ధాంతాలను ఉల్లంఘించిన ఎంతటి వారి పైనైనా అధినేత క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత విషయంలోనూ పార్టీ అదే తీరుగా వ్యవహరించింది. క్రమశిక్షణకు బీఆర్ఎస్ మారుపేరు. ఈ సస్పెన్షన్‌తో పార్టీకి లాభమే తప్పా.. నష్టమేమీ లేదు. – జోగు రామన్న, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

హరీశ్‌రావు బలమైన వాదనలు వినిపించారు



కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో హరీశ్‌రావు బలమైన వాదనలు వినిపించారు. అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగానే ఆయన ముందుకు కదిలారు. అలాంటి వారిపై ఆరోపణలు సరికాదు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా అధినేత చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో అందరికీ ఒకే పద్ధతి అని చెప్పడానికి కవిత సస్పెన్షన్ నిదర్శనం. – అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

పల్లె ఓటర్లు @4,49,981

- పంచాయతీ తుది జాబితా విడుదల
- పురుషులతో పోల్చితే మహిళలే అధికం



వడూర్ జీపీ కార్యాలయంలో తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

కైలాస్‌నగర్: పల్లెపోరుకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను యంత్రాంగం మంగళవారం ప్రకటించింది. త్వరలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత ఓటరు జాబితా ప్రక్షాళనకు ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన వారిని చేర్చడంతో పాటు వార్డులు, గ్రామాల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆదేశించింది. తదనుగుణంగా కసరత్తు చేసిన అధికారులు తుది జాబితా ఖరారు చేశారు. జిల్లావ్యాప్తంగా 4,49,981 మంది పల్లె ఓటర్లున్నట్లు గుర్తించారు. ఇందులో పురుషులు 2,19,652 మంది, మహిళలు 2,30,313 మంది ఉన్నారు. ఇతరులు మరో 16 మంది ఉన్నారు. ఈ జాబితా ఆధారంగానే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

మహిళా ఓటర్లే అధికం..

జిల్లాలో 20 గ్రామీణ మండలాలు ఉండగా వాటి పరిధిలో 473 గ్రామ పంచాయతీలున్నాయి. ఓటర్ల తుది జాబితా తయారీకి ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులపై అభ్యంతరాలను స్వీకరించింది. కొత్తగా కేవలం రెండు ఓట్లు నమోదు కాగా మార్పులు, చేర్పులపై 1400 అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 10,661 మంది అధికంగా ఉన్నారు. వీరే పంచాయతీ పోరులో నిలిచే అభ్యర్థుల తలరాతను మార్చనున్నారు.

మండలాల వారీగా పంచాయతీ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆదిలాబాద్‌రూరల్	13,858	14,674	00
బజార్‌హత్నూర్	11,687	12,141	01
బేల	13,825	13,762	00
భీంపూర్	9,312	10,166	00
భోరజ్	7,302	7,656	00
బోథ్	13,022	14,236	01
ఇచ్చోడ	17,131	18,114	00
గాదిగూడ	7,695	8,104	00
గుడిహత్నూర్	12,361	12,929	00
ఇంద్రవెల్లి	16,033	16,416	03
జైనథ్	9,741	10,253	00
మావల	2,103	2,283	00
నార్నూర్	11,606	11,775	04
నేరడిగొండ	11,517	12,352	00
సాత్నాల	5,241	5,421	00
సిరికొండ	6,431	6,714	00
సొనాల	5,293	5,511	00
తలమడుగు	13,481	14,376	00
తాంసి	6,515	7,267	00
ఉట్నూర్	25,472	26163	07

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌పై కుట్ర

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన



కుమురంభీం చౌక్‌లో బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి కుమురంభీం చౌక్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టను రూపకల్పన చేశారని తెలిపారు. అయితే మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోవడాన్ని సాకుగా చూపుతూ లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టును అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు ప్రతిష్ట దక్కుతుందనే అక్కసుతో రాజకీయ కక్షసాధింపు చర్యలకుపాల్పడుతున్నారని విమర్శించారు. ఇందులో పార్టీ నాయకులు మెట్టు ప్రహ్లాద్, దాసరి రమేశ్, సాజిదొద్దీన్, రాజన్న, ప్రేమల, పవన్ నాయక్, సలీమ్ పాషా, వసంత్, కరుణ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా
- రూట్‌మ్యాప్, పెన్‌గంగ వద్ద ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్, ఎస్పీ

కైలాస్‌నగర్/సాత్నాల: ఈనెల 4, 6 తేదీల్లో నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి శోభాయాత్ర కొనసాగే మార్గాలను మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన చౌక్‌లతో పాటు భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే భోరజ్ మండలం పెన్‌గంగ వరకు గల మార్గాన్ని పరిశీలించి ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఘాట్ల వద్ద శుభ్రత, వాహనాల రాకపోకలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పట్టణంలో రోడ్లు గుంతలమయమైన చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సవరించాలన్నారు.పెన్‌గంగ బ్రిడ్జ వద్ద సరిపడా క్రేన్లు, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. వారి వెంట డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్, తహసీల్దార్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో సెకండ్ బెటాలియన్ కమాండెంట్ నీతిక పంత్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గ్రూప్- 1, 2, 3, 4తో పాటు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఫౌండేషన్ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభ్యర్థులకు ఐదు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ప్రతీ నెల రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురిని కలెక్టర్ సన్మానించారు. ఇందులో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్ బాబు, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

గడువులోపు పనులు పూర్తిచేయాలి

కైలాస్‌నగర్: జిల్లాలో మంజూరైన పనులను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్నూర్ మండల ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతోనే లక్ష్యాలను సాధించగలమని, ప్రతీ విభాగం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నార్నూర్ బ్లాక్ డెల్టా ర్యాంకింగ్, జూలై, ఆగస్టు నెలల కీ పర్ఫామెన్స్ ఇండికేటర్ డేటా, వివిధ శాఖల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మంజూరైన ప్రాజెక్టుల అమలు స్థితిపై ఆరా తీశారు. సమావేశంలో నార్నూర్ కార్యక్రమ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేల్చేలా..

- 7వ చిన్ననీటి వనరుల గణనకు శ్రీకారం
- 230 మంది ఎన్యూమరేటర్లు
- ఎంపీఎస్‌వో, డిప్యూటీ ఎస్‌వోలకు శిక్షణ

జిల్లాలో గత గణనలో గుర్తించిన నీటి వనరుల వివరాలు

బోర్‌వెల్స్	23,161
లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు	575
చెరువులు	464
తవ్వకపు బావులు	7,615



నార్నూర్ మండలంలోని బారిక్‌రావు గూడ గ్రామంలోని వాగు

కైలాస్‌నగర్: సాగునీటి వనరుల లెక్క తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏడో చిన్ననీటి పారుదల వనరుల గణనకు శ్రీకారం చుట్టింది. సర్వే నిర్వహణకు గాను ప్రణాళికశాఖ మండల, డివిజనల్ స్టాటిస్టికల్ ఆఫీసర్లకు జిల్లాస్థాయిలో ఇది వరకే శిక్షణ పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో గణనకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రణాళిక శాఖలో గతంలో పనిచేసిన కంప్యూటర్ సూపర్‌వైజర్లను ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేశారు. ఆగస్టు 30 వరకే ఈ గణన పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ భారీ వర్షాల నేపథ్యంలో కొంత ఆలస్యమైంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఈ గణనను ప్రారంభించనున్నారు. అక్టోబర్ 30 వరకు పూర్తి చేయాలని భావిస్తున్నారు. తద్వారా జిల్లాలో సాగునీటి వనరులతో పాటు వాటి కింద సాగవుతున్న ఆయకట్టు విస్తీర్ణం లెక్క తేలనుంది. అలాగే భూగర్భజలాల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై కేంద్రం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయనుంది.

ఉద్దేశమేంటంటే..

భూగర్భజలాల వినియోగం ఏ స్థాయిలో ఉంది.. నీటి మట్టం తగ్గుతుందా, పెరుగుతుందా.. అనేదాన్ని అంచనా వేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్లకోసారి చిన్ననీటి వనరుల గణనను చేపడుతుంది. ఇది వరకు 2018-19లో ఈ ప్రక్రియను మ్యానువల్‌గా చేపట్టారు. నిర్ణీత ప్రొఫార్మాతో కూడిన మాడ్యూల్స్‌ను సిబ్బందికి అందజేశారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను అందులో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తాజాగా ఈ ఏడాది మళ్లీ సర్వే చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. తదనుగుణంగా ప్రణాళిక శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు.

సాగునీటి వనరుల గుర్తింపు..

వ్యవసాయ సాగుకు ఉపయోగపడే బోరుబావులు, తవ్వకం బావులు, నీటికుంటలు, వాగులు, చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, చెక్‌డ్యాంలు వంటి చిన్ననీటి వనరులన్నింటిని గుర్తించనున్నారు. ఇందుకోసం జిల్లాలోని 509 రెవెన్యూ గ్రామాలకు గాను ఉపాధి హామీలో పనిచేసే 200 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రణాళికశాఖకు చెందిన 30 మంది కంప్యూటర్ సూపర్‌వైజర్లు కలిపి ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామాలను కేటాయించనున్నారు. ఈ వివరాల నమోదు కోసం కేంద్రం ఎంఐ సెన్సెస్ అనే ప్రత్యేక యాప్ రూపొందించింది. ఎన్యూమరేటర్లకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను కేటాయించారు. ఆ ప్రకారం వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆయా వనరులను గుర్తించనున్నారు. వాటి ఫొటో క్యాప్చర్ చేసి, లాంగ్‌ట్యూడ్, ల్యాటిట్యూడ్‌తో పాటు వాటిని ఏ సంవత్సరంలో తవ్వారు, నిర్మించారు.. అందుకు ఎంత వ్యయమైంది.. ప్రస్తుతం ఉపయోగంలో ఉందా.. లేకుంటే ఎన్నేళ్లుగా లేదు.. వాటి ద్వారా ఎన్ని ఎకరాల భూమి సాగవుతుంది.. నీటి మట్టం ఎంత ఉంది అనే వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. అందులో గతంలో గుర్తించిన వనరుల సమాచారం సైతం ఉండనుంది. ఏమైనా మార్పులు చేయాల్సి ఉంటే మార్చనున్నారు. ఈ ప్రక్రియను మండల స్థాయిలో మండల స్టాటిస్టికల్ ఆఫీసర్, డివిజన్ స్థాయిలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సూపర్‌వైజర్లుగా పర్యవేక్షించనున్నారు. ఒక్కో గ్రామంలోని నీటి వనరుల గణనకు గాను ఎన్యూమరేటర్‌కు రూ.1,750 చొప్పున కేంద్రం పారితోషకం చెల్లించనుంది. మండల, డివిజన్ స్టాటిస్టికల్ ఆఫీసర్లకు ఇది వరకే శిక్షణ సైతం అందించారు.

పక్కాగా నిర్వహిస్తాం..

జిల్లాలోని సాగునీటి వనరుల స్థితిగతులు, వాటి కింద సాగు విస్తీర్ణం గుర్తించేందుకు గాను కేంద్రం 7వ చిన్ననీటి వనరుల గణనను చేపడుతుంది. అక్టోబర్ 30వరకు గణన పూర్తి చేయాలని ఆదేశించింది. జిల్లాలో ఈ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తాం. జిల్లా స్థాయిలో ఉద్యోగులకు ఇది వరకే శిక్షణ ఇచ్చాం. మండల స్థాయిలో త్వరలోనే ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి వర్షాలు తగ్గిన వెంటనే గణనను ప్రారంభిస్తాం.– బి.వెంకటరమణ, ప్రణాళికశాఖ జాయింట్ డైరెక్టర్, ఆదిలాబాద్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈనెల 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఈ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. డీఎస్పీ, ఆ పైస్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, తుపాకీలు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపే ఆయుధాలు కలిగి ఉండరాదని పేర్కొన్నారు. అధిక శబ్దంచేసే స్పీకర్లు, డీజేలు వంటి వాటికి అనుమతులు లేవని తెలిపారు. చట్టప్రకారం జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ముందస్తు అనుమతి కోసం సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కిరాణా దుకాణంలో చోరీ

నర్సాపూర్ (జీ): మండల కేంద్రంలోని ఓ దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మనుబోలు శ్రీనివాస్ లక్ష్మీనరసింహ రిటైల్ అండ్ హోల్‌సేల్ కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి కిరాణా దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కనిపించాయి. లోనికి వెళ్లి చూసి రూ.60వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బ్యాంక్ స్కాంలో మరో 3 కిలోల బంగారం రికవరీ



నగల రికవరీ కోసం విచారణ చేస్తున్న సీఐ దేవేందర్‌రావు

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లో జరిగిన భారీ కుంభకోణంలో 25.17 కిలోల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన విషయం తెలిసిందే. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇప్పటికే 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. మిగతా బంగారాన్ని రికవరీ చేసేందుకు దర్యాప్తు చేస్తున్న పోలీసుల ప్రైవేట్ ఫైనాన్స్‌లపై దాడులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాలలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో మరో మూడు కిలోలు, చెన్నూర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు గ్రాముల బంగారు ఆభరణాలను చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేసినట్లు తెలిసింది.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో అక్రమంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు షేక్ అయ్యుబ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. అతడి నుంచి రూ.3వేల విలువైన 2.700 ఎంఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన బీఆర్ఎస్ నాయకులపై కేసు

బోథ్: రోడ్డుపై ర్యాలీ, ధర్నా నిర్వహించిన తొమ్మిది మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన తుల శ్రీనివాస్, షేక్ ఆసిఫ్, తుల హరీశ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, పుల్సింగ్ నాయక్‌తండాకు చెందిన రాథోడ్ ప్రదీప్, సకారం, చింతల్‌బోరి గ్రామానికి చెందిన ముండే ఈశ్వర్, పుల్సింగ్‌నాయక్‌తండాకు చెందిన అదే కిశోర్, గుర్రాలతండాకు చెందిన సోలంకి రుక్మాన్‌సింగ్ మంగళవారం మండలంలోని సొనాల గ్రామంలోని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ర్యాలీలకు అనుమతి లేదని పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రోడ్డుపై వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ ఘటనపై ఏఎస్సై రాథోడ్ ధర్మాసింగ్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గుదిబండగా బదిలీ విధాన ఉత్తర్వులు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

- కొత్త నిబంధన మార్చాలని డిమాండ్
- తొమ్మిది నెలలుగా నిలిచిన బదిలీలు

శ్రీరాంపూర్: సింగరేణిలో జారీ అయిన నూతన బదిలీ విధాన ఉత్తర్వులు గుదిబండగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రిక్వెస్ట్ బదిలీ విధానాలను మార్చుతూ కంపెనీ మే నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లోని నిబంధనలతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఉద్యోగులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవాలంటే ప్రస్తుతం ఉన్న ఏరియాలో పూర్తి చేసి ఉండాలి. అప్పుడే అతని దరఖాస్తును స్వీకరిస్తారు. ఆ పిమ్మట అవకాశాన్ని బట్టి బదిలీ జరుగుతుంది. ఈ దరఖాస్తులను కూడా క్యాలెండర్ ఇయర్‌లో రెండుసార్లు మాత్రమే స్వీకరిస్తారు. ఏప్రిల్, అక్టోబర్‌లో మాత్రమే బదిలీ ప్రక్రియ చేపడతారు. తన సర్వీస్ కాలంలో ఓ ఉద్యోగి రెండుసార్లు మాత్రమే రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకునే వీలుంది. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఒకసారి రిక్వెస్ట్ బదిలీపై వచ్చిన తరువాత తిరిగి రిక్వెస్ట్ బదిలీ పెట్టుకోవాలంటే కనీసం మూడేళ్లు ఆ ఏరియాలో సర్వీస్ పూర్తి చేయాలి. ఇక ఫోకల్ పాయింట్‌లో ఉన్న వారికి నాలుగేళ్ల సర్వీస్ ఉండాలనే నిబంధన ఉంది.

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు కూడా..

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు కూడా కొత్త విధానాలు ఇబ్బందిగా మారాయి. వీరికి రిక్వెస్ట్ బదిలీలో ఉన్న ఉత్తర్వుల మాదిరిగా కూడా మూడేళ్లు చేసి ఉండాలి. బదిలీపై వెళ్లాలనుకున్న ఏరియాలో ఇదివరకు 10 ఏళ్లకు మించి చేసి ఉంటే అక్కడికి బదిలీ కావడానికి వీలులేదు. ఈ నిబంధనలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావాల్సి ఉంది. కానీ.. దీని ప్రకారం కంపెనీలో బదిలీలు చేస్తే ఇబ్బందులు వస్తాయని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. అనారోగ్యంతోనో, కుటుంబ ఇబ్బందులతోనో ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు పెట్టుకోవడం జరుగుతుంది. కంపెనీ వెసులుబాటును బట్టి వారి బదిలీలను ఆమోదం చేయడం ఇప్పటివరకు జరిగింది. నేడు ఈ నిర్దిష్ట నిబంధనలు బొగ్గు పరిశ్రమలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

తొమ్మిదినెలల నుంచి పెండింగ్

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం కోసం డిసెంబర్ 2024 నుంచి మే 2025 వరకు కంపెనీ బదిలీల ప్రక్రియ నిలిపివేసింది. తరువాత అదే నెలలో ఈ కొత్త ఉత్తర్వులు తీసుకువచ్చారు. దీంతో ఇప్పటివరకు సుమారు తొమ్మిది నెలలుగా ఎలాంటి బదిలీలు జరగలేదు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు, దరఖాస్తు కోసం వేచి ఉన్న వారు కంపెనీ కొత్త నిబంధనలు చూసి తలలు పట్టుకుంటున్నారు.

నిబంధనలు మార్చాలి



కొత్త నిబంధనలు మార్చాలి. ఈ నిబంధనలతో ఉద్యోగులు ఇబ్బంది పడే ప్రమాదముంది. ఉద్యోగులు అనారోగ్య, కుటుంబ కారణాలతో రిక్వెస్ట్ బదిలీలు కోరుతారు. ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే సింగరేణిలో పని పరిస్థితులు వేరుగా ఉంటాయి. కంపెనీ కొత్తగా తీసుకువచ్చిన బదిలీ విధానాల ఉత్తర్వులు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ విధానాలకు సమాంతరంగా ఉన్నాయి. ఈ విధానాలను ఎత్తివేసి పాత పద్ధతినే కొనసాగించాలి. పైరవీలు లేకుండా చూడాలి.

– కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

'నా భర్తను ఇండియాకు రప్పించరూ..'



రితీశ్ (ఫైల్)

భైంసాటౌన్: తన భర్త దుబాయిలో పనిలేకుండా ఆకలితో అలమటిస్తూ, దుర్భర జీవితం గడుపుతున్నాడని, ప్రభుత్వం స్పందించి అతడిని ఇండియాకు రప్పించాలని భైంసా పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అన్నపూర్ణ వేడుకుంటోంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన సిలివేరు రితీశ్ మూడేళ్ల కిందట అబుదాబికి వెళ్లాడు. రెండేళ్ల అగ్రిమెంట్ పూర్తి కావడంతో అక్కడి నుంచి దుబాయికి వెళ్లాడు. కాగా, పాస్‌పోర్ట్, సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో కొన్ని నెలలుగా అక్కడే ఖాళీగా తిరుగుతున్నాడు. తిండి లేక, ఉండేందుకు చోటు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో అతడు రోదిస్తూ ఇండియాకు పంపాలని వేడుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయం అతడి కుటుంబీకులకు తెలియడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తన భర్తను ఇండియాకు రప్పించాలని అతని భార్య అన్నపూర్ణ ఇటీవల ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులను కలిసి విన్నవించింది. దీంతో వారు అక్కడి గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి సమాచారం ఇవ్వడంతో వారు అతడిని కలిసి మాట్లాడారు. ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తన భర్తను ఎలాగైనా ఇండియాకి రప్పించాలని అన్నపూర్ణ వేడుకుంటోంది. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ఆదుకోవాలని కోరుతోంది. కాగా, రితీశ్, అన్నపూర్ణ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

జైనూర్: మండలంలోని పట్నాపూర్ శివారులో పేకాడుతున్న 11మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని పట్నాపూర్ శివారులో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.11వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టీజీ గేమింగ్ ఆక్ట్ కింద వారిపై కేసు నమోదు చేశారు.

మాటేగాంలో 9మంది..

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో మంగళవారం పేకాడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వారి నుంచి రూ.51,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఊడిన బస్సు టైర్లు.. తప్పిన ప్రమాదం

- 12గంటలు ట్రాఫిక్ అంతరాయం



రోడ్డుపై నిలిచిన వాహనాలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు సోమవారం రాత్రి 10.30గంటలకు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు టైర్లు మండలంలోని బీర్సాయిపేట్ సమీపంలోకి రాగానే ఊడిపోయాయి. దీంతో బస్సు రోడ్డు మధ్యలోనే ఉండిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా 12గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. చిన్న వాహనాలు వెళ్లినప్పటికీ పెద్ద వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. రోడ్డుపై గుంతల కారణంగా బస్సు టైర్లు ఊడిపోయాయో.. లేదా బస్సు పర్యవేక్షణ లోపమో తెలియదు గాని పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 11గంటల వరకు ఇరువైపులా కిలోమీటర్ల మేర పెద్ద వాహనాలు నిలిచిపోయాయి. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఉట్నూర్ మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు, ఇటుగా ఉట్నూర్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం పోలీసుల చొరవతో క్రేన్ సహాయంతో ఆ బస్సును పక్కకు జరపడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఊరంతటికీ ఒకే గణపతి

- ఐక్యతకు నిదర్శనం రాంపూర్



వినాయకుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

సాత్నాల: భోరజ్ మండలం రాంపూర్ గ్రామానికో ప్రత్యేకత ఉంది. గ్రామంలో 620 మంది జనాభా ఉంది. ప్రతీ సంవత్సరం వినాయక చవితి సందర్భంగా గ్రామస్తులంతా విరాళాలు సేకరించి ఒకే చోట పెద్ద గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సామూహిక పూజలు నిర్వహిస్తారు. 120 కిలోల వెండి ఆభరణాలతో గణపతిని అలంకరిస్తారు. ఏడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భజన, సామూహిక కుంకుమార్చన, పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తుండగా అధికసంఖ్యలో పాల్గొంటారు. గ్రామస్తులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజల్లో పాల్గొంటూ వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఘనంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతోంది. ఏడు రోజులపాటు వినాయక మండపం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

చిన్నారిపై లైంగికదాడి కేసులో ఒకరికి 20ఏళ్ల జైలు

నిర్మల్ రూరల్: ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జిల్లా జడ్జి శ్రీవాణి తీర్పు చెప్పారు. ఎస్పీ జానకీ షర్మిల తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో కడెం మండలం నచ్చనిల్లాపూర్ గ్రామానికి చెందిన జాడి నారాయణ అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తర్వాత మంగళవారం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు–పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. నేరం చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ పేర్కొన్నారు. కాగా, నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ వినోద్‌రావు, విచారణ అధికారులు అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఎస్సై ప్రేమ్‌దీప్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారు, నిందితులతో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి మంగళవారం అక్రమంగా నిషేధిత దేశీదారు తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు మహారాష్ట్ర నుంచి కారులో తరలిస్తున్న దేశీదారును కాగజ్‌నగర్ పట్టణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 1,050.90 ఎంఎల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.63వేలు ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ పట్టణానికి చెందిన విశాల్, వినేశ్ మిత్రా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి దేశీదారు సరఫరా చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాలు, మద్యం రవాణా, విక్రయ కేంద్రాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, సిబ్బంది రమేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

'అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి'



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

చెన్నూర్: దసలి పట్టుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులపై అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ కోరారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో మంగళవారం ఆయన పట్టు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఆదివాసీ రైతులు దసలి పట్టు కాయలు పండిస్తున్నారని తెలిపారు. మూడు తరాలుగా అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను అటవీ అధికారులు పట్టుకువచ్చి హింసించడం దారుణమని పేర్కొన్నారు. రోజు రోజుకు వేధింపులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పట్టు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు, నాయకులు రవి, బాపు, శంకరయ్య, తిరుపతి, రాజన్న, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

తలమడుగు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మెరుగు పీతంబర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెరుగు పీతంబర్ ఓ బాలికపై పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ సమయంలో వీడియో చిత్రీకరించాడు. ఎవరికైనా చెప్తే వీడియోలు బయట పెడతానని భయపెట్టాడు. అయినా బాలిక విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీతంబర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్టీపీపీ గిరిజన ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక



ఎస్టీపీపీ ఈడీ చిరంజీవితో కమిటీ సభ్యులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో సింగరేణి గిరిజన ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు గిరిజన ఉద్యోగుల సంఘం సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ డి.పంతులా ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్టీపీపీ ఏరియా బ్రాంచ్ ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా డీ దేవేందర్‌సింగ్, గౌరవాధ్యక్షుడిగా కిరణ్‌బాబు, అధ్యక్షుడిగా బానోత్ తిరుమల్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీర మోహన్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని కలిశారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ లైజన్ ఆఫీసర్ వెంకటయ్య, చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పులి సురేశ్, బీసీ వెల్ఫేర్ అసోసియేన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


'స్వర్ణ' మూడు గేట్లు ఎత్తివేత



మూడు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తింది. 10,200 ఇన్‌ఫ్లో వస్తుండగా అప్రమత్తమైన అధికారులు మూడు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా, 1182.2 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు. – సారంగపూర్

'కడెం'కు కొనసాగుతున్న వరద



కడెం ప్రాజెక్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం ప్రాజెక్ట్‌కు మంగళవారం తెల్లవారుజామున 1,01,385 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఇరిగేషన్ అధికారులు తొమ్మిది వరద గేట్లు ఎత్తి 99,852 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి వరకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా 10,472 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉంది. – కడెం

'మత్తడివాగు' రెండు గేట్లు ఎత్తివేత



తాంసి: మత్తడివాగు ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే మండలంలోని వడ్డాడి సమీపంలోగల మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి వరదనీరు చేరి నిండుకుండలా మారింది. వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు కురిసిన వర్షానికి ప్రాజెక్ట్‌లోకి వరదనీరు రావడంతో రాత్రి నుంచి ఉదయం వరకు రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. 1,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా రెండు గేట్లు ఎత్తి 2,005 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా, 276.80 మీటర్లు నిల్వ ఉండేలా నీటిని దిగువకు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

'సాత్నాల' నుంచి నీటి విడుదల



సాత్నాల: గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

సాత్నాల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాత్నాల ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. మంగళవారం 1,560 క్యూసెక్కులు రాగా, 1,560 క్యూసెక్కులను ఒక గేటు ద్వారా వదిలిపెట్టినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.046 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వాగు ఉప్పొంగి ఆదివాసీల అవస్థలు



ఒకరినొకరు పట్టుకుని వాగు దాటుతున్న మామిడిగూడ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: భారీ వర్షాలకు వాగులో నీటి ప్రవాహం పెరిగి మండలంలోని మామిడిగూడ(జీ), మామిడిగూడ (బీ) గ్రామాల ఆదివాసీలు ఇబ్బంది పడ్డారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంతకు ఆయా గ్రామాల వారు వచ్చారు. సరుకులు తీసుకుని తిరిగి వెళ్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసి ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న వాగులో వరద ఉధృతి ఎక్కువైంది. దీంతో వారు వాగు ఇవతలి ఆంజీ గ్రామపంచాయతీ పరిధిలోని అంధ్‌మామిడిగూడ గ్రామంలోనే ఉండిపోయారు. తిండి లేక ఇబ్బంది పడ్డారు. చలిమంట వేసుకుని తెల్లవార్లు గడిపారు. మంగళవారం ఉదయం వాగులో కొంత ప్రవాహం తగ్గడంతో ఒకరినొకరు పట్టుకుని వాగు దాటి ఆయా గ్రామాలకు వెళ్లారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3.5కోట్లు మంజూరు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వర్షాలు తగ్గిన వెంటనే వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

పొంగి పొర్లిన తర్ణం వాగు

- నిలిచిపోయిన రాకపోకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న తర్ణం వాగు

సాత్నాల: భోరజ్ మండల పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలికంగా నిర్మించిన లోలెవెల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి 353 బీపై సోమవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు గంటల తరబడి వాహనంలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డుపై కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గ్రామంలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఎడమవైపు వరద ప్రభావిత ప్రాంతంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి మంగళవారం తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఎడమ చేతిలో కొండ రాజ్ (35) అని హిందీలో రాసి ఉందని, కుడి చేతిలో హనుమంతుడి పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి సమాచారం తెలిసినవారు 8712659520, 8712659519 నంబర్లకు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.